

# తనదాకా

ఆ రోజు ఆదివారం.

సుందరం, రాధల పెళ్ళి రోజు.

"ఏవండి, ఇవాళ మన పెళ్ళిరోజు కదా! మీకు ఇవాళ సెలవే. బాగా కలిసొచ్చింది. మీకిష్టమైన స్వీట్ చేస్తున్నా. ఇవాళ మీరు చదరంగానికి వెళ్ళకండి, ప్లీజ్." కాఫీకప్పు టీపాయ్‌మీద పెట్టి తలంటుపోసుకున్న తల చిక్కు తీసుకుంటూ అంది రాధ.

కుర్చీలో కూచుని పేపరు చదువుకుంటున్న సుందరం తలెత్తాడు.

"ఇవాళ మన ప్రోగ్రాం ఏమిటి?" సుందరం చేతిలో కప్పు తను తీసుకుని అతనిచేత కాఫీ తాగిస్తూ అడిగింది రాధ కుర్చీ చెయ్యిమీద కూచుంటూ.

"ఏవండి, ఇది మీకేం బాగా లేదు"

ఆఫీస్ నుంచి వచ్చి, కాఫీతాగి, సబ్బుతో మొహం కడుక్కుని, నీట్‌గా తల దువ్వుకుని, షర్ట్ మార్చుకుంటున్న శ్రీవారు సుందరంతో అంది శ్రీమతి రాధ.

"ఏదీ, ఈ షర్టా? పోనీ బ్లూపోలిస్టర్ షర్ట్ వేసుకోనా, ఈ పేంటు మీదికి బాగుంటుంది" వేసుకోబోతున్న షర్ట్ విప్పేస్తూ అన్నాడు సుందరం.

"అదికాదు నేననేది...." రాధ ఇంకా ఏదో చెప్పబోతూండగానే, బ్లూపోలిస్టర్ షర్ట్ కూడా కాదా? పోనీ, సాయంత్రం పూట కదా, చక్కగా గ్లాస్కో లాల్చీ వేసుకుంటాలే"

"మీ మాట మీదేకాని, నా మాట పూర్తిగా వినరు. అవునులెండి. మీ కంగారు మీది, ఎప్పుడు వెళ్ళిపోదామా అని. అబ్బబ్బ మీకీ చదరంగం పిచ్చి ఏమీ బాగాలేదంటున్నా" మంచంమీద దుప్పటి దులిపి వేస్తూ అంది రాధ.

సుందరానికి చదరంగం ఆడ్డం అంటే చాలా ఇష్టం. ఇంటర్ కాలేజీ మేట్‌లో ఫస్ట్‌ప్రైజ్ కూడా సంపాదించాడు. ఆ తాలూకా లెవెల్‌లో ఛాంపియన్ అనే చెప్పాలి. ఆ వూళ్ళో అంతవరకు తనకు చదరంగం ఆడే వాళ్ళెవరూ తెలియలేదు. వాళ్ళ ఆఫీస్‌లో కూడా ఎవరూ ఆడరు. కాని, పదిరోజుల క్రితం రెండిళ్ళవతల ఓ ఇంట్లోకి అద్దెకొచ్చిన శాస్త్రి గారు చదరంగం ఆటలో దిట్ట అని విని పరిచయం పెంచుకున్నాడు. వారం రోజులుగా సాయంత్రం ఆఫీస్ నుంచి ఇంటికి రాగానే కాస్త కాఫీ తాగి శాస్త్రిగారింటికి వెళ్ళిపోవడం అలవాటయింది సుందరానికి. కాలేజీలో చదువుతుండగా చదరంగం పోటీల్లో సుందరం గెల్చుకున్న వెండి కప్పులు చూసి రాధ గర్వపడేది. తన భర్త మంచి చదరంగం ఆటగాడని. ఈ వారం రోజులుగా రోజూ సాయంత్రం రాగానే శాస్త్రిగారింటికి వెళ్ళిపోతుంటే, పోనీ ఆటలో టచ్ వుంటుందిలే అని సరిపెట్టుకుంది. కాని రాను రాను సుందరం ఇంటికి రావడం లేటయిపోతోంది. తనకి ఇంట్లో ఏమీ తోచడం లేదు. అందుకే అంటోంది. "చదరంగం మరీ పిచ్చిగా ఆడొద్దండీ" అని.

"ఓ....అదా' మరేం లేదు, నెక్స్ట్‌మంత్ ఏలూరులో డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయట. వాటిలో పార్టిసిపేట్ చేద్దామని బాగా ప్రాక్టీస్ చేస్తున్నా. అంతే. ఎంత....ఓ గంటలో వచ్చేస్తాగా" చెప్పులు తొడుక్కుంటూ అన్నాడు సుందరం.

"రోజూ అట్లానే గంటని వెడుతున్నారు. నాల్గేసి గంటలు ఆడుతూ కూచుంటున్నారు. ఏం ఛాంపియన్ షిప్పో ఏమో. మీకు పేరు వస్తుందంటే నాకు సంతోషమే కాని, మన సరదాలు మానుకుని అస్తమానం చదరంగం అంటూ కూచుంటే నాకు ఇంట్లో బోరుకొడుతోంది. ఇవాళ తొందరగా వచ్చెయ్యండి. సరదాగా కాసేపు కబుర్లు చెప్పుకుందాం వెన్నెల్లో కూచుని"

సుందరానికి, రాధకి పెళ్ళయి ఏడాదవ్వొస్తోంది. ఇప్పుడప్పుడే పిల్లలు వద్దనుకున్నారు. మూడు గదుల వాటా తీసుకుని పొందిగ్గా కాపురం చేసుకుంటున్నారు. రాధకి సుందరమంటే ప్రాణం. ఎప్పుడూ అతను తన పక్కనే వుంటూ హుషారుగా కబుర్లు చెబుతూ కులాసాగా గడపాలని కోరిక.

"ఓ, అట్లాగే. రెండే రెండు ఆటలు వేసి గుర్రంలా ఉరుక్కుంటూ వచ్చెయ్యనూ?" గుమ్మందాటుతూ రాధ బుగ్గమీద చిటికేసి బయలు దేరాడు సుందరం. *

"ఏం వుంది?! తమ్మగ భోంచెయ్యటం, సాయంత్రం దాకా తియ్యగ మన పెళ్ళిరోజు కబుర్లు చెప్పుకోటం, సాయంత్రం, నరేంద్రలో మంచి పిక్చరుంది, దానికి వెళ్ళటం, ఇంటికి వచ్చాక, మనుగుడుపుల కబుర్లు చెప్పుతుంటూ....'' మరింత హత్తుకున్నాడు రాధని.

"ఆఁ....ఆఁ....ఆఁ....ఇప్పుడే వేడివేడి కాఫీ మనమీద వలికిందనుకోండి, అప్పుడే కబుర్లూ లేవు, హాస్పిటల్ కబుర్లే.''

ఇద్దరూ కిలకిలా నవ్వుకున్నారు.

భోజనాలయ్యాక మంచంమీద కూచుని పెళ్ళి ఫోటోల ఆల్బమ్ చూసుకుంటున్నారు.

"అరె! ఈ ఫోటోలో మీ అన్నయ్య చెట్టెక్కాడేవిఁటి?!'' సుందరం ఆశ్చర్యంగా అడిగాడు ఫోటోల పెట్టిలో ఓ ఫోటో తీసి చూస్తూ.

"ఏది, ఏది, చూడనివ్వండి, అటువంటి ఫోటో ఏదిలేదే!! అదీకాక మా అన్నయ్యకీ చెట్లెక్కడ మంటే చాలా భయం కూడాను.'' అంతవరకు

# వస్తే...

~ ఎ. ఎస్. లక్ష్మి

చూస్తున్న గ్రూప్ ఫోటో పక్కన పెట్టి, సుందరం చేతిలో ఫోటో లాక్కుని చూసింది రాధ. రాధకి ఎంతో ఆనందంగా ఉంది. ఇట్లాంటి ఆనందపు ఘడియలే తనకు కావల్సింది ఎప్పుడూ.

ఆ ఫోటోలో ఓ కోతి చెట్టు మీద కూచుని ఉంది. పెద్ద తిరుపతి వెళ్ళినపుడు సుందరం తీసిన ఫోటో అది.

రాధ సుందరం కేసి ఓరచూపు చూస్తూ బుంగ మూతి పెట్టింది. వీధి తలుపెవరో కొట్టారు. పక్కింటి లావుపాటి పిన్నిగారు వచ్చారు ఓ గ్లాసు పట్టుకుని.

"అమ్మా రాధా ఓ గ్లాసుడు పంచదార ఇయ్యమ్మా, రేపు తెప్పించి ఇచ్చేస్తా.''

"అట్లాగే పిన్నిగారు, కూచోండి.''

రాధ గ్లాసు తీసుకుని దాన్నిండా పంచదార, ఓ ప్లేట్లో పులిహోర, స్వీట్ తీసుకొచ్చింది.

"ఏమిటీ, కొత్త చీరలా ఉంది, తలంటోసు కున్నావ్, నీ పుట్టిన రోజా?'' పిన్నిగారు చీరకొంగు చేత్తో పట్టుకుని చూస్తూ అడిగారు.

"కాదండి, ఇవాళ మా పెళ్ళి రోజు. ఈ టిఫిన్ తీసుకోండి.'' అని ప్లేటు పిన్నిగారి దగ్గర పెట్టింది. పిన్నిగారు ఆ కబుర్లు, ఈ కబుర్లు చెపుతూ. తాపీగా పులిహోర తింటున్నారు. నాలుగున్నర అయినా ఆవిడకి వంట తొందరలేదు. పిన్నిగారు, బాబయ్య గారు రాత్రిళ్ళు చపాతీలే తింటారు, అప్పటికప్పుడు వేడివేడిగా చేసుకుని, ఏడింటికి. రాధకి ముళ్ళ మీద కూచున్నట్టుంది.

సుందరానికేమీ తోచటం లేదు. పిన్నిగారు ఎప్పుడు వెడతారా అని చూస్తున్నాడు. పోనీ కాస్సేపేదయినా తిరగేద్దామంటే, అన్ని పుస్తకాలూ చదివేసినవే.

వీధి తలుపు చప్పుడయింది. సుందరం అటు చూశాడు. లోపలికొచ్చిన కుర్రాడు, "శాస్త్రిగారు మిమ్మల్నోసారి అర్జంటుగా రమ్మంటున్నారు వాళ్ళ బాబాయ్‌గారు చదరంగంలో స్టేట్ ప్లేయరట. ఆయన వచ్చారుట. మళ్ళీ రేప్పొద్దున్నే వెళ్ళి పోతారుట'' కుర్రాడు చెప్పేసి వెళ్ళిపోయాడు.

సుందరానికి ఎక్కడలేని ఆనందం కలిగింది. ఎప్పట్నుంచో అంటున్నారు శాస్త్రిగారు. ఆయన వస్తారని, వస్తే కబురు చేస్తాననీ.

"రాధా'' పిలిచాడు సుందరం.

పిన్నిగారి బోరు భరిస్తున్న రాధ వచ్చింది బరువుగా.

"రాధానేనోసారి శాస్త్రిగారింటికి వెళ్ళొస్తాను. ఒక గంటలో వచ్చేస్తా. నువ్వు వంటాగింటా ఏమీ పెట్టుకోకు. రాజ్‌కమల్‌లో భోంచేసి, పిక్చర్‌కి వెళ్ళొద్దాం. ఓకే?''

"అదేవిటండీ, ఇవాళ వెళ్ళనన్నారుగా'' బేలగ అంది రాధ.

"అన్నాను, కాని వాళ్ళ బంధువు ఒకాయన స్టేట్ ప్లేయర్ వచ్చారు. ఇప్పుడే వచ్చేస్తాగా. నే వచ్చేటప్పటికి నువ్వు రెడీగా వుండు.'' చెప్పులు తొడుక్కుని బయటకు వెళ్ళిపోయాడు సుందరం.

నిస్పృహాయంగా గుమ్మం దగ్గర చూస్తూ నిలబడి ఆలోచిస్తున్న రాధ 'వెళ్ళొస్తానమ్మా' అన్న పిన్నిగారి మాటలతో ఈ లోకంలోకి వచ్చింది.



పిన్నిగారిని సాగనంపి, రాధ, దొడ్లో ఉన్న సన్నజాజులు కోసి మాల కట్టుకుంది. పనిమనిషి తోమిన గిన్నెలు, కంచాలు ఇంట్లో పెట్టింది. సుందరాని కిష్టమైన, లైట్ బ్లూ నైలెక్స్ మీద బ్లాక్ క్లాత్ బాల్సగ కట్ చేసి అక్కడక్కడ అప్లిక్ వర్క్ చేసిన చీర కట్టుకుంది. బ్లాక్ జాకెట్ వేసుకుంది. తలంటు పోసుకున్న రోజున, మర్నాటిదాకా తలకి నూనె రాయనివ్వడు సుందరం. వదులుగా జడ వేసుకుంది. మాలకట్టిన సన్నజాజులు పెట్టుకుంది. తనకి ఆస్తులు, అంతస్తులు అక్కరలేదు. సుందరం పిల్లగాలి అయితే తను రేకబంతి మొక్క ఆవాలి. తను పున్నమి వెన్నెల అయితే సుందరం సముద్రపు అలయై స్పందించాలి. సుందరం ఆఫీస్ సమయాన ఎట్లాగో భరిస్తోంది. తప్పదు. కాని మిగిలిన అతని ప్రతిక్షణం తనది కావాలి అతను నవ్వాలి, నవ్వించాలి.

ఐదున్నరకల్లా రెడీ అయి కూచుంది పత్రికలు తిరగేస్తూ. ఆరయింది, సుందరం రాలేదు. ఓసారి వీధి వరండాలోకి వెళ్ళి చూసింది. పోనీ కబురు పంపుదామన్నా ఎవరూ లేరు. ఓ పావుగంట పూల చెట్ల దగ్గర తిరుగుతూ గడిపింది, మధ్య మధ్య కాంపౌండ్ వాల్‌మీంచి చూస్తూ సుందరం వస్తున్నాడేమోనని. పెళ్ళిరోజు సాయంత్రం ఇట్లా ఒంటరిగా గడపాల్సి వస్తున్నందుకు రాధకి బాధగాను, విసుగ్గాను ఉంది. గంటలో వస్తానని వెళ్ళిన సుందరం రెండు గంటలవుతున్నా రానందుకు కోపంగా ఉంది. పిక్చర్ నుంచి వచ్చేటప్పుడు భోజనానికి వెళ్ళచ్చులే. అనుకుని లోపలికెళ్ళి కాఫీ పెట్టి ఫ్లాస్కులో పోసింది, సుందరం వచ్చాక ఇద్దరూ కాఫీ తాగి వెళ్ళచ్చని.

ఆరున్నరయింది. సుందరం వస్తున్న జాడ ఏదీలేదు. ఏడయింది. సుందరం రాలేదు. రాధకి ఏడుపొచ్చినంత పనయింది. సుందరం మీద కంటె అతను ఆడే చదరంగం మీద ఎక్కువ కోపం వచ్చింది. ఏమయినాసరే అతనికా ఆట పిచ్చి మాన్పించాలి అనుకుంది. పోనీ నాల్గయిదు రోజులయితే భరించవచ్చు. అతని అభిరుచి కాదనదు. కాని ఆ పోటీలకింకా ఆర్నెల్ల టైముంది. అన్నాళ్ళు ఇంతేనా! అమ్మో! ఆలోచిస్తూ చీర మార్చుకుంది. మామూలు చీర కట్టుకుని స్టౌ మీద కుక్కర్ పెట్టి వచ్చేటప్పటికి సుందరం వచ్చాడు హడావిడిగ.

సాదా చీరలో రాధ. మంచం మీద విడిచి పడేసిన నైలెక్స్ చీర. పరిస్థితి అర్థమయింది.

"సారీ, రాధా! లేటయిపోయింది. ఎంత వచ్చేద్దామనుకున్నా, ఇంకో ఆట, ఇంకో ఆట అంటూ ఆయన కూర్చో పెట్టేశారు."

"నెవ్‌దేరీసెవిల్, దేరీసెవే." నిష్ఠూరం కంటె బాధ ధ్వనించింది, రాధ గొంతులో. సుందరంకేసి తిరిగి మాట్లాడకుండ, విడిచిన చీర మడత పెడుతూ అంది రాధ.

"అదికాదు రాధా. అవతల, ఆయన పెద్దమనిషి. ఆట మధ్యలో వచ్చేస్తానంటే ఏం బాగుంటుంది చెప్పు? ఆఖరి ఆట మొదలు పెట్టకుండా వచ్చెయ్యొచ్చు కాని, తొందరగానే అయిపోతుందనుకున్నా. గంటన్నర పైనే పట్టింది. లే....లే...లే....చీరమార్చుకో. రిక్షలో వెళ్ళిపోదాం. చూసేసిన సినిమాకే వెడదాంలే. ఓ అరగంట సినిమా అయిపోయినా ఫరవాలేదు. ఏడున్నరదాకా బుకింగ్ ఓపెన్‌చేసే వుంటుంది. లేకపోతే సెకెండ్‌షోకి వెడదాం." తొందర పెట్టాడు సుందరం.

"చూడండి, సినిమాకి వెళ్ళలేదే అని కాదు నా బాధ. సినిమా చూసి తీరాలన్న పిచ్చి ఏదీలేదు నాకు. ఇప్పుడు నేనంత డిసప్పాయింట్ అయినది, సినిమాకి వెళ్ళలేదే అని కాదు. సాయంత్రం పూట సరదాగా ఎర్లీగా బయలుదేరి కబుర్లు చెప్పుకుంటూ, నడుచుకుంటూ వెళ్ళి సినిమా చూద్దాం అనుకున్నాం. ఆ తరహాగా జరగలేదే అని నా బాధ. సినిమా నాకు ముఖ్యంగాదు. అంచేత సెకెండ్‌షో అన్న ప్రసక్తే అనవసరం" మడతపెట్టిన చీర గాడ్రెజ్ బీరువాలో పెట్టి తలుపు వేస్తూ తాపీగా అంది రాధ, చివర్లో సుందరం కళ్ళల్లోకి సూటిగా బాధగాచూస్తూ.

"పోనీ అట్లా సరదాగా తిరిగి హోటల్ కెళ్ళి భోంచేసి వద్దాం పద." రాధని డిసప్పాయింట్ చేశానే అన్న బాధ ధ్వనిస్తోంది స్వరంలో.

రాధ మూడ్ బాగాలేదు. ఆ టైములో ఇంకెక్కడికీ వెళ్ళాలనిపించలేదు. "వద్దు లెండి. బియ్యం పడేశా." ముక్తసరిగా చెప్పి ఇంట్లోకెళ్ళింది. కుక్కర్‌మీద వైట్ పెట్టడానికి.

భోజనాల దగ్గర ఇద్దరూ ముభావంగానే ఉన్నారు, పోట్లాడుకోకపోయినా. వాళ్ళిద్దరిదీ పోట్లాడుకునే స్వభావం కాదు. రాధ మనసు బాధపెట్టానే అని సుందరం బాధ. సుందరానికి చదరంగం పిచ్చి మాన్పటం ఎట్లా అని రాధ ఆలోచన. రాధ మనసు బాధపడకుండా, పోనీ చదరంగం మానేద్దామా అనుకున్నాడు సుందరం. గాని, కాంపిటీషన్స్‌కి వెళ్ళాలన్న తపన, ఫ్రెండ్స్ ఇస్తున్న ప్రోత్సాహం, ఆ ఆలోచనకి స్వస్తి చెప్పించాయి.

*

మర్నాడు పొద్దున్నే ఖాళీగా వున్నవాళ్ళ పక్కవాటాలోకి అద్దెకొచ్చారు రవి, అతని భార్య వనజ. వనజ, రాధ కొద్దిగంటల కాలంలోనే బాగా దగ్గరయ్యారు, ఒకే ఏజ్ గ్రూప్‌లో వాళ్ళు కాబట్టి.

సాయంత్రం సుందరం ఆఫీస్ నుంచి వచ్చి కాఫీ తాగి శాస్త్రిగారింటికి బయలుదేరదామనుకుంటుండగా, శాస్త్రిగారే చదరంగం బోర్డు పట్టుకుని వచ్చారు సుందరం ఇంటికి.

"ఇవాళ మా ఇంట్లో పేరంటవోయ్. ఇంట్లో చాలా హడావిడిగా ఉంది. మనం ప్రశాంతంగా కూచుని ఆడ్డానికి ఎక్కడా వీలుగా లేదు. అంచేత నేనే వచ్చేశా" అన్నారు జోళ్ళు విప్పుతూ.

"రండి రండి, పోన్లెండి ఇక్కడే ఆడదాం" టీపాయ్‌కి అటూ ఇటూ కుర్చీలు సర్దాడు సుందరం. చదరంగం బోర్డు మీద బలాలు పేర్చారు ఇద్దరూ. ఆట మొదలుపెట్టారు. ఎత్తులు బాగా వేస్తున్నారు ఇద్దరూ. చాలా సీరియస్‌గా జరుగుతోంది ఆట. సుందరం మంత్రి మీదికి పాన్ జరిపారు, శాస్త్రిగారు. గుర్రం కాపుతో, మంత్రిని ఎక్కడికి తప్పిద్దామా అని ఆలోచిస్తున్నాడు సుందరం తీవ్రంగా. ఆటలో లీనమయిపోయాడు.

"ఏవండి" సంక్రాంతికి కొనుక్కున్న కొత్త పట్టుచీర కట్టుకుని డ్రాయింగ్ రూమ్‌లోకి హుషారుగా వస్తూ పిలిచింది రాధ. శాస్త్రిగారిని చూడగానే హుషారు తగ్గింది.

"ఊఁ" తలెత్తకుండానే పలికాడు సుందరం.

రాధ మనసులో ముల్లు గుచ్చుకుంది. తను కట్టుకున్న పట్టుచీర సుందరం సెలక్షన్ తనకంతగా నచ్చకపోయినా తనని ఆ చీరలో చూసి మురిసిపోవాలనుకున్న సుందరం కోసం, అతని ఆనందం కోసం తీసుకుంది. తనాచీర ఎప్పుడు కట్టుకున్నా, ముద్దులతో ముంచెత్తే సుందరం; తనిప్పుడా చీర కట్టుకుందని తెలిసినా తలెత్తి కూడా చూడలేదు. ఎంతో దగ్గరవ్వాలనుకున్న తమిద్దరిని ఏనుగులు, గుర్రాలు చెరోవేపుకి తరిమికొడుతున్నాయి. వనజ పిలుపుతో ఈ లోకంలో పడింది.

"నేను పేరంటానికెడుతున్నా. అన్నం వండి మీల్స్ టేబుల్ మీద పెట్టి ఇప్పుడే వచ్చేస్తా. కొంచెం కుక్కలు ఇంట్లో దూరకుండా చూడండి, వీధి తలుపు దగ్గరగా పెడుతున్నా."

"ఊఁ వెళ్ళు" తన మంత్రిని ఆ గదిలోంచి కదపడం ఇష్టం లేక, అవతలి మంత్రి మీదికి గుర్రం వేస్తూ అన్నాడు సుందరం.

శాస్త్రిగారి కేసి ఓసారి గుడ్లురిమిచూసి, రెడీ అయి అక్కడికి వచ్చిన వనజతో పేరంటాని కెళ్ళింది రాధ తలుపులు దగ్గరగా వేసి.

శకటుతో రాజు చెప్పారు శాస్త్రిగారు. శాస్త్రిగారి మంత్రి మీదికి వేసిన గుర్రంతో శకటుని తీసెయ్యచ్చు సుందరం. లేకపోతే రాజుని కదపాలి. ఏం చేద్దామా అని ఆలోచిస్తున్నాడు. ఏం చేస్తే తరువాతి స్టెప్స్ ఎట్లా వస్తాయో ఊహిస్తున్నాడు. శాస్త్రిగారు కూడా తన దృష్టిని తీవ్రంగా బోర్డు మీద నిలిపి వ్యూహం పన్నుతున్నారు. చాలా రసవత్తరంగా సాగుతోంది ఆట. చుట్టూ ఏం జరుగుతోందో పట్టించుకునే స్థితిలో లేరు ఇద్దరూ. వాళ్ళిద్దరిది వేరే ప్రపంచం ఆసమయంలో. ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. అరగంట గడిచింది. సుందరం పవర్ ఎడ్వాంటేజ్‌లో ఉన్నాడు. జాగ్రత్తగ స్టెప్స్ వేస్తే గెలుస్తాడు. రాధ, వనజ పేరంటంనుంచి వచ్చారు. గుమ్మాలెక్కుతూ, తలుపు కొద్దిగ తీసి ఉండటం చూసి ఆశ్చర్యపోయింది రాధ.

"ఏదో ఉందండోయ్ వనజా. వీళ్ళు అప్పుడే ఆట ముగించి లేచినట్టున్నారు!" వనజతో అంది.

కాని మళ్ళీ అంతలోనే అనుమానపడుతూ అంది.

"ఏ కుక్కైనా దూరలేదు కదా!" అధుర్దాగా తలుపు తోసి లోపలి కొస్తున్న రాధని రాసుకుంటూ, మూతి నాక్కుంటూ బయటికెళ్ళింది ఓ నల్ల కుక్క తలుపుతోసిన చప్పుడుకి వంటింట్లోంచి వచ్చి.

"ఛీ....ఛీ....ఛీ....అయ్యో అదేమిటండి, కుక్కని పెట్టారు ఇంట్లో? నేచెప్పే వెళ్ళాను కాస్త చూస్తూ ఉండమని. అన్నం ముట్టుకుందో ఏమో!" గబగబలోపలికెళ్ళింది రాధ.

వెనకాలే సుందరం వచ్చాడు నొచ్చుకుంటూ. టేబుల్ మీద పెట్టిన గిన్నెలో అన్నం అంతా చిందరవందరగ పడిఉంది. చారు వలికిపోయి అంచులమీంచి కారుతోంది.

"అయ్యయ్యో, చూడనేలేదు" సుందరం బాధగా అన్నాడు.

"చూడరండీ మీరు! మీకు గుర్రాలు, ఏనుగులు తప్ప కుక్కలెందుకు కనిపిస్తాయి? పోనీ తలుపు గడియేసి కూర్చోలేకపోయారా?" చీపురుతో తుడుస్తూ అంది రాధ.

"వంటింటి తలుపులకి గొళ్ళెంలేదు, సరే, వీధి తలుపుకి గొళ్ళెం పెట్టి వెళ్ళలేకపోయావా! అయినా అన్నం గిన్నె అలమార్లో పెట్టక బయటెందుకు పెట్టావ్?" అహం దెబ్బతినకుండ అన్నాడు, బకెట్టుతో నీళ్ళు తెచ్చి అక్కడ పెట్టి సుందరం.

తప్పంతా తనదేనన్నట్టుగ మాట్లాడిన సుందరానికి ఏదో సమాధానం చెప్పబోయి, ఈ హడావిడికి అక్కడికి వచ్చిన వనజని చూసి ఆగిపోయింది రాధ.

"సర్లే ఇంక వంట ప్రయత్నమేమీ చెయ్యకు హోటల్ నుంచి టిఫిన్ తెస్తాను."

"మళ్ళీ వంట చెయ్యడానికి నాకేమీ బద్దకం లేదండీ....సరుకు పాడయిందే అని నా బాధ."

సుందరం అక్కడి నుంచి వెళ్ళిపోయాక వనజతో అంది రాధ "చూశావా వనజా, ఈయన చదరంగం పిచ్చి? నాకేమో...." ఇంకా ఏదో అనబోతుండగానే వారించింది వనజ, నోటి దగ్గర వేలు పెట్టి సంజ్ఞచేసి.

"ష్. ఇప్పుడేం మాట్లాడకు. అవతల శాస్త్రిగారున్నారు. బాగుండదు. తరవాత మాట్లాడుకుందాం. నేచెబుతాగా."

రాధ మనస్సులో ఎన్నో ఆలోచనలు—ఆయన చదరంగానికి బానిసయిపోతున్నారా? వ్యసనంగా మారుతోందా? ఎప్పటికప్పుడు మానేస్తానంటున్నారు. కాని, మానలేకపోతున్నారు. అయినా తన పిచ్చికాని, ఇదేమైనా పేకాట, తాగుడువంటి డబ్బు తగలేసే వ్యసనమా! కాదే! పోనీ ఈ ఆర్నెల్లూ ఓపికపడితే?

అమ్మో! తనవల్ల కాదు. ఇంక పిల్లలు బయలుదేరితే, ఆ లైఫ్ వేరు. ఆ సరదా వేరు. ఇప్పటి ఈ హాయి వేరు. తనతో ఆయన గడిపే క్షణాలు ఎంత బావుంటాయి! తనకా హాయి తగ్గిపోతుందే!- ఎంతో ఆవేదన, తన పిచ్చి కావచ్చు. ఏదో తెలియని ఒంటరితనం.

ఆరోజు రాత్రి వనజ, రాధ చాలాసేపు మాట్లాడుకున్నారు.

*

మర్నాడు సుందరం ఆఫీస్ నుంచి వచ్చేటప్పటికి రోజూ అలవాటుగా వీధి గుమ్మం తన కోసం నవ్వుతూ నుంచుని కనపడే రాధకి బదులు మూసిన తలుపులు స్వాగతం చెప్పాయి. సుందరానికి ఆశ్చర్యంతోపాటు ఆందోళన కలిగింది. గబగబ మెట్లెక్కి తలుపు తోశాడు. లోపల గడియలేదు. తలుపులు తెరుచుకున్నాయి.

"రాధా....రాధా...." బెడ్‌రూములోకి వస్తూ పిలిచాడు.

"రాధా....రాధా...." బెడ్‌రూమ్‌లోంచి కిచెన్‌లోకి పరిగెట్టినట్టుగా వచ్చి పిలిచాడు.

"..............."

చేరేసి ఉన్న పెరటి తలుపుతీసి పిలవబోయి ఆ దృశ్యం చూసి ఆగాడు. దొడ్లో అరుగు మీద చాప వేసుకుని రాధ, వనజ పేకాడుతున్నారు. సుందరాన్ని చూసి వనజ లేచింది.

"ఓ! అప్పుడే వచ్చేశారే!!" రాధ వచ్చింది ఇంట్లోకి.



MCA/PDC/62/Tel R

"ఏం? అంతలా మునిగిపోయావా ఆటలో, టైము తెలియక! ఇంకాస్సేపు నేను రాకుండా ఉంటే బాగుండుననుకున్నావా?" కొంచెం కఠినం గానే అన్నాడు. వనజతో పేకాడుకుంటున్నందుకు కాదు సుందరం బాధ, కోపమూను. తను ఆఫీస్ నుంచి వచ్చే సమయానికి నీట్‌గా తయారయి గుమ్మంలో నుంచుని స్వీట్‌గా స్వాగతం చెప్పి, తను డ్రెస్ మార్చుకునేలోగా ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెపుతూ కాఫీ యిచ్చే రాధ ఈరోజు తనకి ఆ ఆనం దపు ఘడియలు అందకుండా చేసిందని.

"నె లేనప్పుడాడుకో, వద్దన్ను. కాని రాధా, నాకు దూరం కాకు, ప్లీజ్."

"అది కాదండి, రవిగారేమో కేంప్‌కెళ్ళారు ఇవాళ. వనజకేమి తోచట్లేదంది. ఎంతసేపు కబుర్లు చెప్పుకుంటూ కూచోగలం మేమిద్దరం? 'మీకు పేకాట వచ్చా' అంది. వచ్చన్నాను. 'అయితే ఇంకనేం, మంచి కంపెనీయే దొరికింది సరదాగా ఆడుకుందాం, రండి' అంది. పోనీలేకదా, రెండంటే రెండాటలు ఆడి, మీరు వచ్చే సమయానికి జాకీలా ఉరుక్కుంటూ వచ్చేద్దామని వెళ్ళాను...." 'రెండంటే రెండాటలు' అన్న మాటలు వత్తి పలుకుతూ, కాఫీ గ్లాసులో పోసేటప్పటికి సుందరం సబ్బు పెట్టి తీసుకొని పెరట్లోకి వెడుతూ కనిపించాడు.

కాఫీ త్రాగి శాస్త్రిగారింటికి వెళుతూ అన్నాడు సుందరం "రాధా నే వెళ్తున్నా!"

"ఆఁ..." లోపలి నుంచే సరేనంది రాధ.

గుమ్మం దాటుతున్న వాడల్లా ఒక్కనిమిషం ఆగిపోయి ఆశ్చర్య పోయారు. రాధ రోజూ గేటుదాకా వచ్చి "అసలు వెళ్ళొద్దంటే మీరు వినటంలేదు. పోనీ త్వరగా వచ్చెయ్యండి. ప్లీజ్" అనేది. గారాబంగా బుంగమూతి పెట్టి.

"మీరు లేకపోతే నేనుండలేను" అని ధ్వనించేలా.

కాని, ఈరోజు.........

ఏమిటీ మార్పు? ఎందుకు దూరమవుతోంది?

ఆలోచిస్తూ నడుస్తున్నాడు సుందరం. సుందరం మూడ్ ఏమీ బాగాలేదు.

ఆ రోజు అన్ని ఆటల్లోను ఓడిపోయాడు.

*

"ఏవండి ఇవాళ మీరు శాస్త్రిగారింటికి వెళ్ళటం లేదా?"

ఆఫీస్‌నుంచి వచ్చి కాళ్ళు కడుక్కుని, లుంగీ కట్టుకుని మంచం మీద పడుకున్న సుందరాన్ని అడిగింది రాధ "అయ్యో వెళ్ళటం లేదా" అని ధ్వనించేలా.

"లేదు. ఏం?" సుందరం మనసులో ఏదో వెలితి నిన్నటి నుంచి. తను శాస్త్రిగారింటికి వెళ్ళడం ఇష్టం లేని రాధ అట్లా అడిగినందుకు ఆశ్చర్య మేసింది. "ఆఁ, ఏంలేదు...." మంచమీద దుప్పటి సరిచేస్తూ అంది రాధ. "నేను వనజ పూల్ గేమ్ ఆడుతూ మధ్యలో ఆపేశాము వంటవేళయి.

మీరు శాస్త్రిగారింటికి వెడితే అది కంప్లీట్ చేసేద్దామని" ఏ భావమూ స్పష్టం చెయ్యక తాపీగా అంది రాధ.

పడుకున్నవాడు ఒక్కసారిగా లేచి కూచుని మంచం మీద కూచున్న రాధ భుజం మీద చెయ్యివేసి, కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు సుందరం "రాధా... నే లేకపోతే నువ్వుండలేననేదానివి. నేను ఆఫీస్ నుంచి వచ్చాక నా పక్కన కూచుని ఎన్నో కబుర్లు చెప్పేదానివి. నేను నీ పక్కనుంటే చాలు ఎంతో ఆనందంగా వుంటుందనే దానివి. నాకూ అట్లానే వుంటుంది. పగలల్లా ఆఫీస్‌లో పడ్డ శ్రమంతా మర్చిపోయేవాడిని. ఏమిటీ మార్పు? నాకంటే నీకు పేకాట ఎక్కువయిందా? ఇప్పుడు నేనింట్లోంచి ఎప్పుడు బయటకు వెళ్ళిపోతానా అని చూస్తున్నావు!!"

"ఛ. అదేం లేదండి" అంత కంటే అప్పటికి ఇంకేమీ సమాధానం చెప్పదల్చుకోలేదు రాధ. మాట మార్చింది.

"ఆఁ అన్నట్టు మధ్యాహ్నం రావుగారు, ఆయన భార్య వచ్చారు. ఆయనకి హైదరాబాదు ట్రాన్స్‌ఫర్ అయిందికదా? ఒన్‌థర్టీ ట్రైన్‌కి వెళ్ళిపోతున్నారుట. చెప్పడానికి వచ్చారు"

"అదేమిటి? మొన్న మనింటికి సెండాఫ్ పార్టీకి వచ్చినప్పుడు ఎల్లుండి నైట్ వెళుతున్నామని చెప్పారు కదా! అంటే ఎల్లుండి – మరి రేపటికే ఎందుకు ప్రయాణం మార్చుకున్నారో?!" ఆశ్చర్యంగా అడిగాడు సుందరం.

"అదే అడిగాను నేను. ఎల్లుండి హైదరాబాదులో వాళ్ళ చుట్టాలింట్లో ఏదో ఫంక్షన్ వుందిట. అంచేత నైట్‌నే వెళుతున్నారు"

"అయితే రేపు నేను ఆఫీస్‌లో పెర్మిషన్ అడిగి వస్తాను నువ్వు రెడీగా వుండు నేవచ్చేటప్పటికి"

తరవాత వాళ్ళిద్దరూ రావుగారి గురించి, ఆయన మంచితనం గురించి చాలాసేపు కబుర్లు చెప్పుకున్నారు. రావుగారు, సుందరం తండ్రి ఆప్త మిత్రులు. సుందరం కాలేజీ చదువు రావుగారింట్లో ఉండే చదివాడు. ఉద్యోగం దొరకడం విషయంలో కూడా రావుగారు ఎంతో సహాయం చేశారు. రావుగారంటే సుందరానికి అపరిమితమైన అభిమానం. సుందరానికి, రాధకి కూడా రావుగారి దగ్గర, ఆయన భార్య దగ్గర బాగా చనువు.

*

పొద్దున్న లేస్తూనే సుందరం రాధకి గుర్తు చేశాడు.

"రాధా, ఇవాళ మనం స్టేషన్ వెళ్ళి రావుగారి ఫేమిలీకి సెండాఫ్ ఇవ్వాలి ఆఫీస్‌లో పెర్మిషన్ తీసుకుని ఒంటి గంటకి వస్తా. నే వచ్చేటపుడే రిక్షా తీసుకొచ్చేస్తా. రెడీగా ఉండు మైసూర్‌పాక్ చెయ్యి. రావుగారికి చాలా ఇష్టం. పట్టుకెళ్ళి ఇద్దాం." బ్రష్ మీద పేస్ట్ వేస్తూ అన్నాడు సుందరం.

కాఫీ కలుపుతూ సరేనంది రాధ.

ఆ రోజు ఆఫీస్‌లో సుందరానికి పనివత్తిడి ఎక్కువగా ఉంది. ఆఫీసర్ దగ్గర పెర్మిషన్ తీసుకుని బయటికి వచ్చేటప్పటికే ఒంటి గంటయిపోయింది. ఆఫీస్ నుంచి ఫోన్ చేస్తే ట్రైన్ కరెక్ట్ టైమేనని చెప్పారు.

ఏమీ ఆలస్యం చెయ్యకుండా గబగబ ఇంటికెళ్ళి రాధని తీసుకొని తొందరగా వెడితే సరిగ్గా టైముకి వెళ్ళగలడు. అందుకే రిక్షా, బేరం కూడా ఆడకుండా ఎక్కి గబగబ ఇంటికొచ్చాడు. రాధ రెడీగా వీధి గుమ్మంలో నిలబడి ఉంటుందనుకున్న సుందరానికి నిరాశే మిగిలింది. రిక్షా దిగి ఒక్క అంగలో మెట్లెక్కి ఇంట్లోకి వచ్చాడు. రాధ లేదు. కిచెన్‌లో చూశాడు. అక్కడ పాలు పొంగిపోతూ కనిపించాయి. వాళ్ళ కిచెన్‌కి ఉన్న కిటికీలోంచి అవతలవాటాలో వనజతో పేకాడుతూ కనిపించింది రాధ.

ఎక్కడలేని కోపం, చిరాకు వచ్చాయి సుందరానికి.

"రాధా" గట్టిగా కేకేశాడు.

"ఆఁ వస్తున్నా" చేతిలో ఉన్న పేకముక్కలు అక్కడ పారేసి వచ్చింది రాధ కంగారుగా.

"అరె, వచ్చేశారా? అప్పుడే ఒంటి గంటయిందా? ఉండండి ఒక్క నిమిషం. కాస్త మొహం కడుక్కుని, చీర మార్చుకుని వచ్చేస్తా." స్టౌకేసి చూసింది.

"అయ్యో పాలు పొంగిపోయి వేస్టయ్యాయే! ఈ ధ్యాసే లేదు నాకు" అంటూ పట్టకారుతో గిన్నె దింపింది.

"రాధా, నీకేమైనా బుద్ధుందా?" ఎప్పుడూ రాధపట్ల అంత కఠినంగా మాట్లాడని సుందరానికి విపరీతంగా కోపం వచ్చింది. "మరీ నీకింత పేకాట పిచ్చి అయితే ఎట్లా? మనిషివైనందుకు కాస్త విచక్షణాజ్ఞానం ఉండాలి. మనం పెట్టుకున్న ప్రోగ్రామేమిటి, నువ్వు నిర్లక్ష్యం చేసి ఇక్కడ చేస్తున్న ఘనకార్యం ఏమిటి? ఇప్పుడు నువ్వు తెమలడం మొదలుపెడితే, అవతల ట్రైన్ వెళ్ళిపోతుంది...."

"పోనీ, మీరొక్కరూ...." రాధ నసిగింది తలుపు పక్కగా నుంచుని బొటనవేలితో నేల మీద రాస్తూ.

"ఛీ ఊరుకో. నేనొక్కణ్ణే వెళ్ళలేకకాదు. వాళ్ళకి, మనకి ఉన్న అనుబంధాన్నిబట్టి, మనిద్దరం కలిసి సెండాఫ్ ఇవ్వడానికి వెళ్ళకపోతే ఏం గౌరవంగా ఉంటుంది? నన్నింత డిసప్పాయింట్ చేస్తావనుకోలేదు. నా పరువు మర్యాదలు కూడా లెక్కచెయ్యటం లేదు నువ్వు. ఆ రోజు నేను కాస్త పరధ్యానంగా ఉండి అన్నం కాస్తా కుక్క పాడుచేస్తే అంత బాధ పడ్డావే! ఇప్పుడు నువ్వు చేసిందేమిటి? ఇప్పుడు పాలు వేస్టయిపోతే ఆ బాధ ఏమయింది? అసలాపరిస్థితి ఎందుకు రావాలి? ఎందుకిట్లా మారిపోయావ్? అవతల టైమ్ అయిపోయింది. నువ్వు రెడీకాకుండా కూచున్నావ్.

"టైమ్ తెలీలేదండి, మీరైనా వెళ్ళకపోతే బాగుండదు. టైమ్ అయిపోతోందంటున్నారు. త్వరగా వెళ్ళండి" చేత్తో తీసుకున్న సోప్ బాక్స్ యథాస్థానంలో పెట్టేస్తూ అంది రాధ.

"నేనొక్కణ్ణే వెళ్ళలేక కాదు. దానికిందాక కారణం చెప్పా. ఇంకో కారణం కూడా వుంది. మనిద్దరం వెళ్ళాలని నా సరదా. ఆ విషయం నీకూ తెలుసు. అయినా, పేకాట మోజులో నా విషయం, నా సరదా నీ కక్కర లేకుండాపోయింది."

"అది కాదండి. మరేమో, మానేద్దామనుకుంటూనే ఇంకొక ఆట వేసుకున్నాము. అదొక్కటి ఆడి మానేద్దామని. రెండు జోకర్లు నాకే వచ్చాయి. పైగా సీక్వెన్స్ అయింది. కాని ఎప్పటికి ముక్కలు..." సుందరం మూడ్ మార్చటానికి తాపత్రయపడింది రాధ.

[41 వ పేజీ చూడండి]

[తనదాకా వస్తే: 15వ పేజీ నుంచి]

"ఆపు. నీ సోది నాకక్కర్లా. మైసూర్‌పాక్ ముక్కలు ఇటు పారెయ్. నేనొక్కణ్ణే వెడతాను. నువ్వు రానందుకు ఏదో సర్ది చెప్పు కుంటాను."

"సారీ అండి, మైసూర్‌పాక్ కుదరలేదు. ముక్కలు రాలేదు. పొడుం పొడుం అయిపోయింది. పోనీ బజార్లో కొని పట్టకెళ్ళండి" బేలగా అంది రాధ.

సుందరం ఉగ్రరూపం దాల్చాడు. రాధ చెంప ఛెళ్లు మంది.

"ఛీ, ఎంత దిగజారిపోయావ్, ఏనాడైనా మైసూర్‌పాక్ పాడు చేశావా? కళ్ళు మూసినా పేక ముక్కలే కనిపిస్తుంటే మైసూర్‌పాక్ ముక్కలెలా వస్తాయ్? పైగా ఉచిత సలహాలిస్తున్నావా, బజార్లో కొని పట్టుకెళ్ళమని? ఇంట్లో తయారుచేసి, ఇద్దరం వెళ్ళి ఇస్తే కలిగే తృప్తి బజార్లోవి ఇస్తే కలుగుతుందా? లేకపోతే ఆయన కొనుక్కు తినలేరని యిస్తున్నామా? మన ఇంట్లో మనం తయారు చేసి ఇస్తే దాని వెనక ఉండే అభిమానం, ఆప్యాయత, ఆత్మీయత వేరు...." ఎప్పుడూ రాధ మీద చెయ్యి చేసుకోని సుందరం మనస్సు కలుక్కుమంది రాధ కన్నీళ్ళు చూసేటప్పటికి.

వాచీ చూసుకుని వెనక్కు తిరిగి నిశ్చేష్టుడయ్యాడు సుందరం.

గుమ్మంలో రావుగారు, భార్య నుంచుని ఉన్నారు గంభీరంగా. వెనకాలే వనజ వచ్చింది. రాధ కన్నీళ్ళు చూసి రావుగారి భార్య రాధని దగ్గరకు తీసుకుని హత్తుకున్నారు.

"మీరు....మీరు...." నీళ్ళు నమిలాడు సుందరం ఆశ్చర్యంగా రంగారావుగార్ని చూసి.

"చూడు సుందరం. ముందు నీ మనస్సులోని ప్రశ్నకి సమాధానం — మేము ఇదివరకనుకున్నట్టుగానే రేపు వెడుతున్నాము ఇవాళ కాదు" మీల్స్ టేబుల్ దగ్గరున్న కుర్చీ ఇవతలికి జరిపి కూర్చున్నారు రావుగారు.

"సరదాలు, సంతోషాలు భార్యాభర్తలిద్దరికీ ఒకటే."

రాధని కొట్టడం చూశారేమోనని పీలవుతూ బెదురుగా నుంచున్న సుందరాన్ని కూచోమని సంజ్ఞ చేస్తూ అంటున్నారు రావుగారు.

"తన భార్య ఎప్పుడూ తన దగ్గర ఉండి తన అవసరాలు చూస్తూ, 'నీతోటిదే లోకం' అన్నట్టుగ ఎప్పుడూ నవ్వుతూ, కబుర్లు చెపుతూ గడపాలని భర్త అనుకోడం, నాలుగు గోడ్ల మధ్య ఇంటి పనులలో సతమతమయ్యే భార్య, తన భర్తనుంచి కూడా అదే ఆశించడం, అధర్మం, అన్యాయం కాదు. ఒకళ్ళనొకళ్ళు నిర్లక్ష్యం చేసుకుని, మిగిలిన వాటికి ప్రాముఖ్యత ఇచ్చి ఒకళ్ళ మర్యాదలు ఇంకొకరు కాపాడలేక, ఒకరి సరదాలు ఇంకొకరు తీర్చలేక పోతేనే వస్తుంది చిక్కు. శాస్త్రిగారితో నీకు పరిచయమవక ముందు ఎంత హాయిగా గడిచింది నీ సంసారం! మీరిద్దరూ చిలకాగోరింకల్లా కిలకిల్లాడుతూ ఉండేవారే! ఆహాఁ, అట్లా అని నువ్వు చదరంగం ఆడ్డం పూర్తిగా మానెయ్యమనీ కాదు, ఆడ్డం తప్పనీ కాదు, నా భావం. కానీ, దేనికైనా పరిమితి ఉండాలి. నీ కోసం, పోనీ....కొంతసేపు భరిస్తుంది ఒంటరితనం. కాని పగలల్లా ఇంట్లొ పనులు చూసుకుని సాయంత్రం నువ్వు ఆఫీస్ నుంచి వచ్చాక నీతో కబుర్లు చెప్పుకుంటూ రిలాక్స్ అవుదామనుకున్న రాధకి రాత్రి పొద్దుపోయేదాకా ఒంటరితనమే అయితే, ఐమీన్, పుస్తకాలుండనీ, ఫ్రెండ్స్ ఉండనీ, ఎంత కుమిలిపోతుందో ఎప్పుడైనా ఆలోచించావా?

ఎంతసేపు పుస్తకాలు చదివి, ఇతరులతో కబుర్లు చెప్పి కాలం గడుపుతుంది? నువ్వావ్యసనానికి దూరం అయితే, మళ్ళీ ఇదివరకులా మీ సంసారం ఎప్పుడూ పండువెన్నెల్లా ఉంటుందని భావించింది, పిచ్చి రాధ నీ మీద ప్రేమకొద్దీ. ఆ చదరంగం ఉంది చూశావ్, అది మహా టైమ్ కిల్లింగ్ ఆట. ఆడేవాళ్ళకి కాలం తెలీదు. ఈ కాలం అట్లా వేస్ట్ అవడం రాధకిష్టంలేదు. నీ మనసు ఎక్కడ బాధపడుతుందోనని, గయ్యాళిగ నిన్ను శాసించకుండా. తమాషాగా తన వైపుకి తిప్పుకుని నీ ఒడిలో పరవసించాలి ఎప్పుడూ అని తపనపడి ఈ నాటక మాడింది. మీ మేరేజ్ డే నాడు రాధని డిసప్పాయింట్ చేశావ్. డిసప్పాయింట్‌మెంట్ రుచి ఇప్పుడు నువ్వు చూశావ్."

"నాటకమా..." సుందరం ఆశ్చర్యంగ అందరివేపు చూశాడు. వనజ తలుపు చాటునుంచి ఇవతలికి వచ్చింది. "అవునండి, నేనే ఈ నాటక మాడమని సలహా ఇచ్చి, చివరికి దెబ్బలు తినిపించాను రాధకి. అసలు నాకు పేకాట రాదు. నేర్చుకుందుకు ప్రయత్నించలేదు ఇష్టంలేక. కాని క్లబ్బు నుంచి సెకెండ్‌హేండ్ పేక తెప్పించి మేం పేకాడుతున్నట్టుగ నాటక మాడాము. మీరు ఇంటికి వచ్చేసమయానికి ఇన్నాళ్ళు, తనకు కాకుండా పోయిన సుఖ సంతోషాలు మీకు దూరంచేసి, మీకు వాటి విలువ తెలియ చెప్పాలని, తననుంచి మీరు ఎప్పుడూ ఏది కోరుకుంటారో అదే తనూ మీనుంచి కోరుతుందని మీకు తెలియాలని ఇట్లా చేసి మిమ్మల్ని ఇబ్బంది పెట్టాల్సి వచ్చినందుకు క్షమించండి. రాధ పేరుకి తగ్గది. మీ పట్ల రాధకి అపరిమితమైన ప్రేమ. కావాలని పాలు పొంగబెట్టాము. వుండండి అందరికీ మా ఇంట్లో కాఫీలు కలిపి తెస్తా." ఇంట్లోకి వెళ్ళింది వనజ.

సుందరం కళ్ళు చెమర్చాయి.

రావుగారు, భార్య డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్ళారు.

సుందరం ఒక్క ఉదుటున లేచి వెళ్ళి రాధని కౌగిలించుకుని ముద్దులతో నింపేశాడు. రాధ నవ్వుతూ విడిపించుకుని, డబ్బాలోంచి మైసూర్‌పాక్ ముక్క ఒకటి తీసి సుందరం నోటికందించింది.

"అరె! పొడి అతుక్కుందా?" అన్నాడు సుందరం ఆశ్చర్యంగా మైసూర్‌పాక్ చూస్తూ.

"కాదు. మనసులు అతుక్కున్నాయి" అంది రాధ ప్లేట్లలో మైసూర్‌పాక్ ముక్కలు అందరికోసం పెడుతూ హుషారుగా. □